ప్రజా పాలనకు వేళాయె..



- డివిజన్‌కు నాలుగు సెంటర్లు ఏర్పాటు
- సనత్‌నగర్‌లో 16 కౌంటర్లు, ఒక హెల్ప్ డెస్క్
- నేటి నుంచి దరఖాస్తుల స్వీకరణ
- అందరూ సహకరించాలని అధికారుల సూచన


బేగంపేట సర్కిల్ పరిధిలోని కార్పొరేటర్లతో సమావేశమైన బేగంపేట డీసీ శంకర్

సనత్‌నగర్: బేగంపేట సర్కిల్ పరిధిలోని బేగంపేట, రాంగోపాల్‌పేట, బన్సీలాల్‌పేట, మోండా డివిజన్లలో ఏర్పాటుచేసిన ప్రత్యేక కౌంటర్ల ద్వారా ఆరు గ్యారంటీలకు సంబంధించిన దరఖాస్తులను స్వీకరించనునట్లు అధికారులు పేర్కొన్నారు. ఆయా డివిజన్లకు మొత్తం 16 కౌంటర్లను ఏర్పాటు చేశామన్నారు. ప్రజా పాలన కార్యక్రమంలో భాగంగా అభయహస్తం గ్యారంటీ పథకాల లబ్ధిదారుల నుంచి దరఖాస్తులను స్వీకరించనున్నారు. ఇందులో భాగంగా మహాలక్ష్మి, ఇందిరమ్మ ఇళ్లు, గృహజ్యోతి, చేయూత పథకాలతో పాటు రేషన్‌కార్డుల కోసం దరఖాస్తులను తీసుకోనున్నట్లు బేగంపేట సర్కిల్ ఉప కమిషనర్ శంకర్ తెలిపారు. అయితే పూర్తిస్థాయిలో దరఖాస్తు ఫారాలు ఇంకా ఆయా సెంటర్లకు రాలేదు. ఇంటింటికీ దరఖాస్తు ఫారాలు అందజేయనున్నట్లు సమాచారం. అయితే దీనిపై అధికారులకు కూడా పూర్తి స్పష్టత లేదు.

సికింద్రాబాద్‌లో..

సికింద్రాబాద్: సికింద్రాబాద్ నియోజకవర్గం పరిధిలోని ఐదు డివిజన్లలో నిర్వహించనున్న ప్రజాపాలన సభలకు జీహెచ్‌ఎంసీ అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. సభల నిర్వహణ కోసం ఇప్పటికే అధికారులు, ఉద్యోగులకు శిక్షణ తరగతులను నిర్వహించారు. బుధవారం జీహెచ్‌ఎంసీ సికింద్రాబాద్ సర్కిల్ కార్యాలయంలో డిప్యూటీ కమిషనర్ ఎస్ సుధాంశ్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఒక్కో రోజు ఒక్కో డివిజన్‌లోని నాలుగు ప్రాంతాల్లో ప్రజాపాలన కార్యక్రమాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ఒక్కో కార్యక్రమ నిర్వహణను పర్యవేక్షించేందుకు గాను అసిస్టెంట్ కమిషనర్, సూపరింటెండెంట్, అసిస్టెంట్ ఇంజినీర్ స్థాయి అధికారులను నియమించారు.ఈ సమావేశంలో ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ వేణుమాధవ్‌రావు, ప్రత్యేక అధికారి లక్ష్మీనారాయణ, కార్పొరేటర్లు సామల హేమ, కంది శైలజ, వివిధ విభాగాలకు చెందిన అధికారులు, ఉద్యోగులు హాజరయ్యారు.

సెంటర్ల వివరాలు..

అడ్డగుట్ట: తుకారాంగేట్ (ఎంసీహెచ్ క్వార్టర్లు)జీహెచ్ఎంసీ కమ్యూనిటీహాల్, బాబు జగ్జీవన్‌రాం భవన్ తుకారాంగేట్, జీహెచ్‌ఎంసీ కమ్యూనిటీహాల్ బోయబస్తీ, అంబేడ్కర్ భవన్ జీహెచ్‌ఎంసీ కమ్యూనిటీహాల్ శాంతినగర్.

తార్నాక: మోడల్ మార్కెట్ ఇందిరానగర్ లాలాపేట్, వినోబానగర్ కమ్యూనిటీహాల్, నాగార్జునగర్ కమ్యూనిటీహాల్, సెవెన్ టెంపుల్స్ కమ్యూనిటీహాల్ మాణికేశ్వరీనగర్.

మెట్టుగూడ: వార్డు కార్యాలయం మెట్టుగూడ, ముదిరాజ్ సంఘం భవనం మెట్టుగూడ, జీహెచ్‌ఎంసీ కమ్యూనిటీహాల్ విజయపురి కాలనీ, జీహెచ్‌ఎంసీ కమ్యూనిటీహాల్ చింతబావి.

సీతాఫల్‌మండి: బీదలబస్తీ కమ్యూనిటీహాల్, నామాలగుండు హనుమాన్ టెంపుల్ ఎదురుగా, ఉప్పరబస్తీ కమ్యూనిటీహాల్ నామాలగుండు, ఇందిరానగర్ కమ్యూనిటీహాల్ వారాసీగూడ, బీదలబస్తీ మైదానం.

బౌద్ధనగర్: జీహెచ్‌ఎంసీ కమ్యూనిటీహాల్ బౌద్ధనగర్, అశోక్‌నగర్ నవసంగం కమ్యూనిటీహాల్, ఆంజనేయస్వామి దేవాలయం సమీపంలోని జీహెచ్‌ఎంసీ కమ్యూనిటీహాల్, జీహెచ్‌ఎంసీ కమ్యూనిటీహాల్ అంబర్‌నగర్.

కంటోన్మెంట్‌లో..

కంటోన్మెంట్: ప్రజాపాలన కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కంటోన్మెంట్ బోర్డు సీఈఓ మధుకర్ నాయక్ అన్నారు. బుధవారం బోర్డు కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సికింద్రాబాద్ ఆర్‌డీఓ రవికుమార్, స్థానిక ఎమ్మెల్యే లాస్య నందితతో కలిసి ప్రజాపాలన దరఖాస్తులను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీఈఓ మాట్లాడుతూ.. ఈ నెల 28 నుంచి వచ్చే నెల ఆరో తేదీ వరకు కంటోన్మెంట్‌లోని అన్ని వార్డుల పరిధిలో ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ కొనసాగుతుందన్నారు. డిసెంబర్ 31, జనవరి 1న మాత్రం సెలవు ఉంటుందని తెలిపారు. వార్డుల వారీగా ప్రతీ రోజూ నాలుగు వేర్వేరు ప్రాంతాల్లో దరఖాస్తుల స్వీకరణ ఉంటుందన్నారు. ప్రస్తుతానికి దరఖాస్తుల స్వీకరణ మాత్రమే కొనసాగుతుందని, ఆయా పథకాలకు మార్గదర్శకాలు విడుదల చేశాక అర్హుల జాబితా రూపొందిస్తామన్నారు. దరఖాస్తుల సమయంలో ఆధార్ కార్డుతో పాటు రేషన్ కార్డు సహా ఇతరత్రా దరఖాస్తు వివరాలు తెలపాలన్నారు. రేషన్ కార్డులేని వాళ్లు సైతం కొత్త రేషన్ కార్డు కోసం కూడా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. తహసీల్దార్లు అశోక్, పద్మ సుందరి, అధికారులు అఫ్జల్, అక్బర్ అలీ, దేవేందర్, మహేందర్, కృష్ణ, బాలకృష్ణ పాల్గొన్నారు.

బేగంపేట డివిజన్

పాటిగడ్డ మోడల్ మార్కెట్ టీమ్ లీడర్
అందాలుదేవి-9000 061678
మయూరిమార్గ్‌లోని అంబేడ్కర్ కమ్యూనిటీ హాల్
తిరుమలయ్య-7331189517)
మాతాజీనగర్ కమ్యూనిటీ హాల్ గణేష్-63059 68530
శ్యాంలాల్ బిల్డింగ్స్‌లోని తాతాచారికాలనీ కమ్యూనిటీ హాల్
సరిత-91541 56670

రాంగోపాల్‌పేట డివిజన్

ఎంజీరోడ్డు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల కుమార్-91000 91941
చుట్టలబస్తీ కమ్యూనిటీ హాల్ శివప్రసాద్-73375 57267
రాణిగంజ్ మేకలబండ కమ్యూనిటీ హాల్ మాధవి-73311 89493
రాంగోపాల్‌పేట రాజీవ్‌గాంధీ కమ్యూనిటీహాల్
సంతోష్-97013 65525

బన్సీలాల్‌పేట డివిజన్

కీస్ కో-ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ కమ్యూనిటీహాల్
కిరణ్‌రెడ్డి-98493 88873
వెంకటాపురం కాలనీ తుంగభద్ర కమ్యూనిటీహాల్
నవీన్-79950 09099
బన్సీలాల్‌పేట సీసీనగర్ కమ్యూనిటీ హాల్
ఆంజనేయులు-98499 08093
భోలక్‌పూర్ కృష్ణానగర్ కమ్యూనిటీ హాల్
రామస్వామి-63099 20614

మోండా డివిజన్

పెర్కిబస్తీ కమ్యూనిటీహాల్ గాయత్రీదేవి-99490 20921
ఆదయ్యనగర్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ రవీందర్-90001 14920
డొక్కాలమ్మ టెంపుల్ కార్తీక్-91212 42764
వెస్ట్‌మారేడ్‌పల్లి మల్టీపర్పస్ ఫంక్షన్ హాల్ రాజశ్రీ-79933 60223

ఖైరతాబాద్ సర్కిల్ అమీర్‌పేట డివిజన్

బీకేగూడ వార్డు కార్యాలయం సుధీర్‌చంద్ర-95423 11121
ఎస్‌ఆర్‌నగర్ బాపూనగర్ కమ్యూనిటీ హాల్ జమీల్-8790624601
లీలానగర్ కమ్యూనిటీ హాల్ మాధవి-79895 46542
శ్రీవివేకానంద కమ్యూనిటీ హాల్ యతీంద్ర మోహన్-95736 72492

సనత్‌నగర్ డివిజన్

నెహ్రూపార్కు వార్డు కార్యాలయం
కైలాష్‌చంద్ శ్రీవాత్సవ్-90009 94031
దాసారం బస్తీ కమ్యూనిటీ హాల్ సాయిసందీప్-79950 09096
లేబర్ వెల్ఫేర్ సెంటర్ జీహెచ్‌ఎంసీ స్పోర్ట్స్ కాంప్లెక్స్
దామోదర్‌రెడ్డి-72079 23092
అల్లాపుద్దీన్‌కోఠి కమ్యూనిటీ హాల్ శ్రీనివాసులు-91542 96637


అధికారులు, ఉద్యోగులతో సమీక్ష నిర్వహిస్తున్న డిప్యూటీ కమిషనర్ సుధాంశ్


దరఖాస్తు వివరాలు వెల్లడిస్తున్న ఆర్‌డీఓ రవి, సీఈఓ మధుకర్ నాయక్, ఎమ్మెల్యే లాస్య

ఘనంగా అయ్యప్ప మండల పూజ



లాలాపేట: తార్నాక డివిజన్ లాలాపేటలోని అయ్యప్ప సేవా సమితి ఆధ్వర్యంలో బుధవారం లక్ష్మీ గణపతి అయ్యప్ప దేవస్థానంలో 33వ మండల పూజను ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి గణపతి హోమం, సర్వాభిషేకాలు, సహస్రనామార్చన, అష్టోత్తరం తదితర పూజాది కార్యక్రమాలు జరిగాయి. అధిక సంఖ్యలో హాజరైన మాలధారులు, భక్తులు చేసిన అయ్యప్ప నామస్మరణ, భజనలు, కీర్తనలు పాడుతూ భక్తిపారవశ్యంలో మునిగితేలారు. స్వామియే శరణం అయ్యప్ప అంటూ భక్తులు చేసిన శరణుఘోషతో లాలాపేట ప్రాంతంలో పూర్తిగా ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. అనంతరం ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమానికి స్థానికులు పెద్ద ఎత్తున హాజరయ్యారు. ఆలయ కమిటీ బాల్‌రాజు గుప్తా, పరమేశ్వర్ గౌడ్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కుట్టివెల్లోడి ఆసుపత్రి సందర్శన


ఆసుపత్రిని సందర్శించిన సామల హేమ

సికింద్రాబాద్: సీతాఫల్ మండిలోని కుట్టివెల్లోడి ప్రభుత్వ ఆసుపత్రిని బుధవారం కార్పొరేటర్ సామల హేమ సందర్శించి అక్కడ అందిస్తున్న సేవలపై ఆరా తీశారు. కరోనా కేసులు నమోదవుతున్న క్రమంలో ఆసుపత్రికి వచ్చే రోగులకు జాగ్రత్తలు వివరించాలని, రోగులు తీసుకోవాల్సిన జాగ్రత్తల పట్టికను ఏర్పాటు చేయాలని సూచించారు. కరోనా లక్షణాలు కలిగి ఉన్నట్టు గుర్తించిన రోగులకు నిర్ధారణ పరీక్షలు నిర్వహించాలన్నారు.

ఉత్సాహంగా వార్షికోత్సవం



సనత్‌నగర్: పల్లవి మోడల్ హైస్కూల్ 30వ వార్షిక వేడుకలు సికింద్రాబాద్ హరిహర కళాభవన్‌లో బుధవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. విద్యార్థులను అన్ని రంగాల్లో తీర్చిదిద్దడమే లక్ష్యంగా పల్లవి మోడల్ స్కూల్ కొనసాగుతుందని చైర్మన్ కొమురయ్య పేర్కొన్నారు. మిస్టర్ ఇండియా 17 అక్షల నీలకంఠం, డాక్టర్ శివానీ కోహ్లీ, ప్రిన్సిపాల్ రేణుచక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ ప్రజావేదికకు కార్పొరేషన్ చైర్మన్ ఇవ్వండి

బంజారాహిల్స్: ఇటీవల జరిగిన తెలంగాణ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయానికి తాము పని చేశామని, పార్టీ అధికారంలోకి రావడం తమకు ఎంతో ఆనందంగా ఉందని తెలంగాణ ప్రజా వేదిక అధ్యక్షుడు బండి సదానందం అన్నారు. బుధవారం ఆయన న్యూఢిల్లీలో రాజ్యసభ సభ్యుడు, సీడబ్ల్యూసీ సభ్యుడు, కాంగ్రెస్ జాతీయ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే, ఆఫీస్ ఇంచార్జి సయ్యద్ నసీర్ హుస్సేన్ ను కలిసి తనకు తెలంగాణ పర్యాటక శాఖ కార్పొరేషన్ చైర్మెన్ గా అవకాశం కల్పించాలని వినతి పత్రం అందించారు. పర్యాటక శాఖతో పాటు ఇతర ప్రజా సేవ చేసే కార్పొరేషన్లు ఎన్నో ఉన్నాయని అందులోనైన అవకాశం కల్పించాలని కోరారు.

ఆందోళన వద్దు.. అప్రమత్తతే ప్రధానం



- గాంధీ ఓపీలో ఎనిమిది కోవిడ్ పాజిటివ్ కేసులు
- స్వల్ప లక్షణాలతో కోలుకున్న నలుగురు
- స్వీయ నియంత్రణలో మరికొందరు
- అనుమానం ఉంటే ఆర్‌టీపీసీఆర్ చేయించుకోండి
- సూపరింటెండెంట్ ప్రొఫెసర్ రాజారావు



గాంధీఆస్పత్రి : గత వారం రోజుల వ్యవధిలో గాంధీ ఆస్పత్రి అవుట్ పేషెంట్ విభాగంలో ఎనిమిది కోవిడ్ పాజిటివ్ కేసులు నమోదు కాగా, స్వల్ప లక్షణాలతో నలుగురు పూర్తిస్థాయిలో కోలుకోగా, స్వీయ నియంత్రణలో ఉన్న మిగిలిన వారిని గాంధీ వైద్యులు ప్రతిరోజు ఫోన్ ద్వారా మాట్లాడి పర్యవేక్షణ చేస్తున్నారు. లక్షణాలను పరిశీలించి తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వేసుకోవాల్సిన మందులను సూచిస్తున్నారు. పాజిటివ్ వచ్చిన రోగుల కుటుంబ సభ్యులకు కోవిడ్ టెస్టులు చేయగా అందరికీ నెగిటివ్ రావడం గమనార్హం. ఈ సందర్భంగా గాంధీ సూపరింటెండెంట్ ప్రొఫెసర్ రాజారావు బుధవారం పలు అంశాలపై మాట్లాడారు.

- ఒమిక్రాన్ సబ్ వేరియంట్ అయిన జేఎన్-1 సెల్ఫ్ లిమిటింగ్ వైరస్ అని, సోకిన ఐదు నుంచి ఏడు రోజుల్లో దానంతట అదే తగ్గిపోతుందన్నారు. రోగనిరోధక శక్తి తక్కువ ఉన్నవారు, బాలింతలు, గర్భిణులు, వృద్ధులు, చిన్నారులు, దీర్ఘకాల రుగ్మతలతో బాధపడేవారు అప్రమత్తంగా ఉండాలన్నారు.
- ఈనెల 19వ తేది నుంచి 27వ వరకు గాంధీ ఓపీ విభాగంలో ఎనిమిది కోవిడ్ పాజిటివ్ కేసులు నమోదు కాగా, నలుగురు కోలుకోగా, మిగిలిన వారు స్వీయ నియంత్రణలో ఉన్నారని, వారితో ప్రతిరోజు ఫోన్ ద్వారా మాట్లాడుతున్నామన్నారు.
- రాష్ట్రంలోని వివిధ ఆస్పత్రులు నుంచి 59 కోవిడ్ పాజిటివ్ కేసులు నమూనాలు నోడల్ కేంద్రమైన గాంధీ ఆస్పత్రికి వచ్చాయని, వీటిని జీనోమ్ సీక్వెన్సింగ్ కోసం ఉప్పల్‌లోని సెంటర్ ఫర్ డీఎన్‌ఏ ఫింగర్ ప్రింటింగ్ అండ్ డయాగ్నోస్టిక్స్‌కు పంపినట్లు తెలిపారు.
- గాంధీ మెడికల్ కాలేజీ మైక్రోబయోలజీ వైరాలజీ ల్యాబ్‌లో అధునాతన వైద్య యంత్రాలు, నిపుణులు అందుబాటులో ఉన్నారని, కేంద్ర ప్రభుత్వం ఆదేశించి, రీఏజెంట్స్ (అవసరమైన ద్రావకాలు) పంపిస్తే ఇక్కడే జీనోమ్ సీక్వెన్సింగ్ చేపడతామన్నారు. సెకెండ్, థర్డ్ వేవ్‌లలో జీనోమ్ సీక్వెన్సింగ్ చేసిన అనుభవం ఉందన్నారు.
- రెండ్రోజుల క్రితం ఓ ఆస్పత్రిలో ర్యాట్ టెస్ట్ చేయించుకుంటే కోవిడ్ పాజిటివ్ రాగా, సదరు బాధితుడు గాంధీ ఆస్పత్రికి వస్తే ఆర్‌టీపీసీఆర్ టెస్ట్ చేయగా నెగిటివ్ వచ్చిందన్నారు. అనుమానిత లక్షణాలు ఉన్నవారు తప్పని సరిగా ఆర్‌టీపీసీఆర్ టెస్ట్ చేయించుకోవాలని, గాంధీ ఆస్పత్రిలో ఉచితంగా అన్నిరకాల వైద్యపరీక్షలు చేస్తున్నామన్నారు.
- అనవసర భయాందోళనకు గురి కావద్దని, అప్రమత్తంగా ఉంటూ కోవిడ్ నిబంధనలు పాటించాలని, దగ్గు, జ్వరం, గొంతు నొప్పి, నీరసం, ఆయాసం, ఒళ్లునొప్పులు వంటి లక్షణాలు కనిపిస్తే తక్షణమే కోవిడ్ టెస్ట్ చేయించుకోవాలని ప్రొఫెసర్ రాజారావు సూచించారు.



ఆరు హామీలను సద్వినియోగం చేసుకోవాలి


మాట్లాడుతున్న ఆదం సంతోష్ కుమార్

అడ్డగుట్ట: కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆరు హామీలను అర్హులంతా సద్వినియోగం చేసుకోవాలని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఆదం సంతోష్ కుమార్ సూచించారు. బుధవారం తుకారాంగేట్‌లోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో సంతోష్‌కుమార్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నెల కాకముందే ఇచ్చిన హామీలను అమలు పరిచేందుకు కృషి చేస్తుందన్నారు. సికింద్రాబాద్ నియోజకవర్గంలోని కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలకు పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాల్సిన బాధ్యత ఉందన్నారు. తెలియని వారికి వివరించి దరఖాస్తు చేసుకునేందుకు సహాయ పడాలన్నారు. హైదరాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా పొన్నం ప్రభాకర్‌ను అధిష్ఠానం నియమించిందని, నగరంలో ఎలాంటి సమస్యలున్నా వాటిని పరిష్కరించేందుకు అవసరమైన నిధులు సమకూర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. కాంగ్రెస్ నాయకులు అమర్‌నాథ్ గౌడ్, కిషోర్ యాదవ్, దౌలత్‌ఖాన్, సునీత, రవికుమార్, వెంకట్ పాల్గొన్నారు.

ముగిసిన ఎన్‌సీసీ కేడెట్ల శిక్షణ శిబిరం


ముగింపు కార్యక్రమంలో పాల్గొన్న కల్నల్ ప్రదీప్‌కుమార్

రసూల్‌పురా: సికింద్రాబాద్ బైసన్ పోలో మైదానంలో గత పది రోజుల నుంచి వన్ తెలంగాణ గర్ల్స్ బెటాలియన్ ఎన్‌సీసీ కేడెట్ల వార్షిక శిక్షణ శిబిరం బుధవారంతో ముగిసింది. కమాండింగ్ ఆఫీసర్, కల్నల్ ప్రదీప్‌కుమార్ నేతృత్వంలో ఎన్‌సీసీ కేడెట్లు సైనిక అంశాలు ఆయుధ శిక్షణ, మ్యాప్ పఠనం, ఫీల్డ్‌క్రాఫ్ట్, యుద్ధ క్రాఫ్ట్ నాయకత్వ లక్షణాలు తదితర అంశాలపై శిక్షణ పొందారు. అదే విధంగా వివిధ రంగాల్లో నిపుణులైన ప్రముఖ లెక్చరర్ల ద్వారా స్ట్రెస్ మేనేజ్‌మెంట్, వేస్ట్ రిసైక్లింగ్ మెళకువలు, అడ్వెంచర్ యాక్టివిటీస్, కెరీర్ కౌన్సెలింగ్ అంశాల్లో శిక్షణ పొందారు. శిక్షణ పూర్తి చేసుకున్న కేడెట్లకు కల్నల్ ప్రదీప్‌కుమార్ సర్టిఫికెట్ల అందజేశారు. ఎన్‌సీసీ అడ్మిన్ ఆఫీసర్, అసోసియేట్ అధికారులు పాల్గొన్నారు.


సర్టిఫికెట్లతో ఎన్‌సీసీ కేడెట్లు

న్యాయశాఖ ఉన్నత స్థానాల్లో ముస్లింలకు ప్రాధాన్యం ఇవ్వాలి

పంజగుట్ట: న్యాయశాఖలో ఉన్నత స్థానాల్లో ముస్లిం మైనార్టీలకు జనాభా ప్రాతిపదికన స్థానం కల్పించాలని ది ఆల్ ఇండియా అడ్వకేట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కన్వీనర్ మిర్జ నిస్సార్ అహ్మద్ బేగ్ ప్రభుత్వాన్ని కోరారు. గత 76 సంవత్సరాల్లో అడ్వకేట్ జనరల్, అడిషనల్ అడ్వకేట్ జనరల్, పబ్లిక్ ప్రాసిక్యూటర్ పదవులు ముస్లింలకు ఇవ్వలేదని కేవలం గవర్నమెంట్ ప్లీడర్, అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్, అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌కే పరిమితం చేశారని ఆవేదనవ్యక్తం చేశారు. బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ .. ఎన్నికలకు ముందు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నిరంగాల్లో మైనార్టీలకు ప్రాధాన్యత ఇస్తామని హామీ ఇచ్చారని గుర్తుచేశారు. న్యాయశాఖలో కూడా తగు న్యాయం చెయ్యాలని జనాభా దామాషా ప్రకారం న్యాయశాఖ ఉన్నత స్థానాల్లో తమకు స్థానం కల్పించాలని విజ్ఞప్తి చేశారు.

తెలంగాణ ఆర్ట్ సొసైటీ ఆవిర్భావం

పంజగుట్ట: కళాకారులను అందర్నీ ఒక్క వేదికపైకి తీసుకువచ్చేందుకు తెలంగాణ ఆర్ట్ సొసైటీ ప్రారంభిస్తున్నట్లు సొసైటీ ప్రతినిధులు పేర్కొన్నారు. బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో సొసైటీ ఆవిర్భావ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతినిధులు ఎస్.మధుమోహన్, విద్య వెంకట్, డి.వి.రమణలు మాట్లాడారు. ప్రస్తుత తరుణంలో టెక్నాలజీ పెరిగి కళాకారులకు ప్రాధాన్యత తగ్గుతుందని దీంతో వారి ఆర్థిక పరిస్థితి దుర్భరమౌతోందని ఆవేదనవ్యక్తం చేశారు. కళాకారుల ఆత్మగౌరవాన్ని కాపాడుకుంటూ ఆర్థికస్థితి గతులను మెరుగుపరుచుకుని రాబోయే తరాలను కూడా ఉత్తేజపరచడం సంఘం లక్ష్యమన్నారు.

29 నుంచి ఎగ్జిబిషన్

పంజగుట్ట: అసోసియేషన్ ఆఫ్ లేడీ ఎంటర్‌ప్రెన్యూర్స్ ఆఫ్ ఇండియా (అలీప్) ఆధ్వర్యంలో ఎన్‌ఎమ్‌ఎమ్‌ఈ సహకారంతో ఈ నెల 29 నుండి 31 వరకు అలీప్ వీకార్ట్ 'ఉద్యమీ ఉన్నతీ' పేరుతో నెక్లెస్‌రోడ్డు లోని, పీపుల్స్‌ప్లాజా గ్రౌండ్‌లో ఎగ్జిబీషన్ నిర్వహిస్తున్నట్లు అలీప్ సెక్రటరీ వి.శ్రీదేవి తెలిపారు. బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో కరపత్రాన్ని ఆవిష్కరించారు.

ఎర్రగడ్డ రైతుబజార్‌లో కూరగాయల ధరలు

సనత్‌నగర్: టమాటా రూ.21, నల్లవంకాయ 55, పొడుగు వంకాయ 45, బెండకాయ 50, పచ్చిమిర్చి 45, బజ్జీమిర్చి 50, క్యాప్సికమ్ 70, పచ్చకాకర 71, పందిరి బీర 45, క్యాబేజీ 16, క్యారెట్ 40, దొండ 50, గుండుబీన్స్ 45, గింజ చిక్కుడు 70, గోకరకాయ 55, కీర 13, దోసకాయ 28, బీట్‌రూట్ 25, ఉల్లిగడ్డ 20, ఆలుగడ్డ 21, చామగడ్డ 50, మొరంగడ్డ 28, కందగడ్డ 45, సొరకాయ 17, పొట్లకాయ 18, అరటికాయ 9, మునగకాయ 4-6, ముల్లంగి 4-6. ఈ ధరలు గురువారం ఉదయం 9 గంటల వరకు అమలులో ఉంటాయి.

అధికారులు.. ఆధునికీకరించరూ!



సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ ఎదురుగా ఉన్న సర్దార్ వల్లభాయ్ పటేల్ విగ్రహానికి మరమ్మతులు చేసి పరిసరాలను ఆధునికీకరించాలని బీజేపీ లీగల్‌సెల్ జిల్లా కన్వీనర్ భాస్కర్‌గిరి కోరారు. జీహెచ్‌ఎంసీ జోనల్ కమిషనర్ రవికిరణ్‌కు కలిసిన ఆయన వినతిపత్రం అందించారు. విగ్రహం శిథిలావస్థకు చేరుతుండడంతో పాటు విగ్రహం చుట్టూ ఉన్న ఫ్లోరింగ్ ధ్వంసమైందని ఆవేదన వ్యక్తం చేశారు. వచ్చే నెలలో సర్దార్ వల్లభాయ్ పటేల్ వర్ధంతి వేడుకలు ఉన్న నేపథ్యంలో ఆధునికీకరించాలని కోరారు. -సికింద్రాబాద్

నామినేటెడ్ పదవులపై ఉద్యమ విద్యార్థి నేతల ఆశలు!

ఉస్మానియా యూనివర్సిటీ: కాంగ్రెస్ ప్రభుత్వంలో నామినేటెడ్ పదవుల పై ఉద్యమ విద్యార్థి నేతలు ఆశలు పెట్టుకున్నారు. తెలంగాణ ఉద్యమం నుంచి పోరాడి రాష్ట్ర అవతరణ అనంతరం ఉద్యోగాల కోసం బీఆర్‌ఎస్ ప్రభుత్వం పై పోరాడిన ఓయూ విద్యార్థి నేతలు చనగాని దయాకర్‌గౌడ్, లోకేష్ యాదవ్, వరంగల్ రవి, ఉదయ్‌కుమార్, బాల లక్ష్మీ, దుర్గం భాస్కర్, కొనగాల మహేష్ తదితరులు నామినేటెడ్ పదవుల కోసం ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు. గత ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తరఫున పోటీ చేసేందుకు ఎమ్మెల్యే టిక్కెట్ కోసం ఎస్సీ, ఎస్టీలు రూ.25 వేలు, బీసీ, ఓసీలు రూ.50 చెల్లించి దరఖాస్తు చేసుకొని చివరి రోజు వరకు ఎదురు చూసి ఓయూ విద్యార్థి నేతలు భంగపడ్డ పడ్డారు. కనీసం ఎస్సీ, ఎస్టీ రిజర్వుడు స్థానాలలో సైతం విద్యార్థి నేతలకు అవకాశం లభించలేదు. టిక్కెట్ దక్కలేదని అసంతృప్తి చెంది తీవ్ర మనస్తాపంతో కోటూరి మానవత రాయ్, కురవ విజయ్‌కుమార్ కాంగ్రెస్ నాయకుల పై అనేక ఆరోపణలు చేసి పార్టీని వీడి బీఆర్‌ఎస్‌లో చేరారు. మరికొందరు విద్యార్థి నేతలు నామినేటెడ్ పదవుల ఆశతో పాటు పార్టీ పెద్దల బుజ్జగింపు మేరకు కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపు కోసం ఎన్నికల ప్రచారం చేశారు. ఈ నెల 7న కాంగ్రెస్ ఎమ్మెల్యేలు అధికారం చేపట్టిన నాటి నుంచి ప్రతి రోజు మంత్రులు, పార్టీ ముఖ్య నేతల దర్శనం కోసం విద్యార్థి నేతలు సచివాలయం, ఇతర కార్యక్రమంలో చురుకుగా పాల్గొంటున్నారు. టీపీసీసీ కూడా ఓయూ విద్యార్థి నేతల పేర్లను నామినేటెట్ పదవుల పరిశీలించినట్లు పత్రికల్లో రావడంతో మరింత ఉత్సాహంతో ప్రభుత్వ కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం నగర మేయర్‌తో పాటు రెండు ఎమ్మెల్యేలు, 8 నామినేటెట్ పదవులలో ఓయూ విద్యార్థి నేతలను నియమించినట్లు ఓయూ కాంగ్రెస్ పక్ష విద్యార్థి నేతలు గుర్తు చేశారు.